క్లుప్తంగా

జగన్నాథుని ఉత్సవానికి రథం సిద్ధం



దాసన్నపేటలో ఉత్సవానికి సిద్ధమైన నూతన రథం

విజయనగరం టౌన్: జగన్నాథునికి ఉత్సవానికి దాసన్నపేటలో ఈ ఏడాది నూతన రథం సిద్ధమైంది. పాత రథం పూర్తిగా పాడైపోవడంతో మూలకు చేరింది. దాని స్థానంలో దాతల సహాయసహకారాలతో ఈ ఏడాది కొత్తరథం నిర్మాణం పూర్తయి వేడుకకు ముస్తాబైంది. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు.

రూ.10 లక్షల పరిహారం అందించాలి



బంగారుబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

డెంకాడ: మండలలలోని సింగవరం పంచాయతీలో క్లాప్‌మిత్ర విధులు నిర్వహిస్తున్న దత్తి బంగారుబాబు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు పరిహారం, ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మృతుని కుటుంబాన్ని సీఐటీయూ నాయకులు శుక్రవారం పరామర్శించారు. క్లాప్ మిత్రలకు ప్రభుత్వం ఎటువంటి భద్రత, బీమా సౌకర్యం కల్పించకపోవడం అన్యాయమన్నారు. వారికి తగిన హక్కులు కల్పించాలని కోరారు.

వృక్ష సంరక్షణతోనే మనుగడ



గ్రీన్ ఇండియా మిషన్ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: వృక్ష సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు శుక్రవారం నగరంలోని పలు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెట్ల సంరక్షణ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకుడు వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కో–ఆర్డినేటర్ వెంకటరమణ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌బాబు, వృక్షశాస్త్ర ఉపాధ్యాయులు, పాఠశాల డీన్ సూర్యచంద్ర, ఐపీఎల్ సత్యనారాయణ, సీబీఐ చిన్న నాయుడు పాల్గొన్నారు.

నేరస్తులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

పూసపాటిరేగ: నేరస్తులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎ.సన్యాసినాయుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం స్క్రాప్ దుకాణాల యజమానులుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, విలువైన వస్తువులను దొంగతనం చేసి స్క్రాప్ దుకాణాలకు విక్రయిస్తున్నారని అన్నారు. దొంగతనం చేసి తీసుకొచ్చిన ఆస్తిని కొనుగోలు చేసినట్లయితే షాపు యజమానులపై చర్యలు తప్పవన్నారు.

అన్నిరంగాల్లోనూ రాణించాలి



పోస్టల్ స్టాంప్‌లను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్, తదితరులు

విజయనగరం టౌన్: విద్యార్థులు అన్నిరంగాల్లోనూ రాణించాలని పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. మాన్సాస్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పొదుపు అనేది చాలా కీలకమైనదన్నారు. అందుకు తగ్గట్టుగానే పోస్టల్ శాఖ ఎల్లప్పుడూ సేవలందిస్తోందన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ స్టాంప్‌లను ఆవిష్కరించారు. అనంతరం క్విజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిలాటెలిస్ట్ కాపుగంటి రవి, మాన్సాస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ జీవీఎస్ఎస్ సుబ్బారావు, హెచ్ఎం శ్రీనివాసరావు, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

రుణ చెల్లింపులు వేగవంతం చేయండి

● కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

విజయనగరం: బ్యాంకర్లకు ఇబ్బంది లేకుండా రుణ చెల్లింపులు వేగవంతం చేయాలని సిటీ మిషన్ మేనేజర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్స్‌కు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. కార్పొరేషన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బ్యాంకర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడ్కో గృహాలు, ప్రధానమంత్రి స్వనిధి, స్వయం సహాయక సంఘాలు, ప్రధానమంత్రి ఉపాధి కల్పన, స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారులు త్వరితగతిన రుణాలు చెల్లించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా టిడ్కో గృహ సముదాయాల లబ్ధిదారుల నుంచి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను కమ్యూనిటీ ఆర్గనైజర్లు, బ్యాంకర్ల నుంచి అడిగి తెలుసుకున్నారు.

అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి రుణాలు మంజూరు చేశామని బ్యాంకర్లు తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వివరించారు. రిజిస్ట్రేషన్, మార్ట్ గేజ్ ప్రక్రియ పూర్తి కాకపోవడం వల్ల కొద్దిపాటి రుణాలు మంజూరు కాలేదని కమ్యూనిటీ ఆర్గనైజర్లు తెలిపారు. అనంతరం కమిషనర్ మల్లయ్య నాయుడు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. మిగిలి ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే బ్యాంకర్ల నుంచి సహాయ సహకారాలు అందుతాయన్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, టిడ్కో ఈఈ జ్యోతి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సంజీవరావు, డీసీసీబీ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, టిడ్కో, హౌసింగ్ సిబ్బంది శ్రీనివాస్, సురేష్, సురేంద్ర తదితరులు, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న శ్రీరామ సేవా సమితి ప్రతినిధులు, వేదపండితులు

విజయనగరం టౌన్: శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీరామ సేవా సమితి శుక్రవారం సాయంత్రం నగరంలో భక్తిశ్రద్ధలతో శోభాయాత్రను నిర్వహించింది. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల వేదపండితులు శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ సేవాసమితి ప్రతినిధులు కట్టమూరి చంద్రశేఖరం, నేమాని భద్రాద్రి సీతారామం, డాక్టర్ ఉలిమిరి వెంకట సోమయాజులు మాట్లాడుతూ జూలై ఆరో తేదీ నుంచి ఉదయం 7 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శంకరమఠం వేదికగా శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. జూలై 14 వరకూ కార్యక్రమాలు సాగుతాయని, భక్తులందరూ పాల్గొని తరించాలని కోరారు. కార్యక్రమంలో చీలా నారాయణమూర్తి, భోగరాజు సూర్యలక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆ చట్టాలు వద్దు

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేస్తున్న భారత న్యాయ సంహిత చట్టం 106 (1-2) లను రద్దు చేయాలని, రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం కలెక్టరేట్ వద్ద ఈ నెల 10న చేపట్టే ధర్నాలో ప్రభుత్వ, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లందరూ పాల్గొనాలని కోరారు. ఈ మేరకు కోట, బాలాజీ కూడలి, దాసన్నపేట, బాబా మెట్ట, నీల ట్యాంకు ఆటో స్టాండ్, హుకుంపేట సుద్ద వీధిలోని శ్రీ పైడిమాంబ లారీ వర్కర్స్ యూనియన్, పెద్ద చెరువు గట్టు వద్ద ఉన్న శ్రీ విజయ దుర్గ లగేజ్ గూడ్స్ వెహికల్స్ డ్రైవర్స్‌తో కలిసి శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. నూతన చట్టాలు డ్రైవర్లకు, వీధి వ్యాపారులకు, సామాన్య ప్రజానీకానికి తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీను, రామునాయుడు, రాజు, లక్ష్మణదొర, మారయ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ర్యాబీస్ టీకాల శిబిరం

విజయనగరం ఫోర్ట్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా బహుళార్థ పశు వైద్యశాల (వెటర్నరీ పోలీ క్లినిక్) ఆవరణంలో శనివారం ఉదయం 8 గంటలకు 3 నెలలు వయసు దాటిని పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా ర్యాబీస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ ధర్మారావు తెలిపారు. ఈ శిబిరాన్ని పెంపుడు జంతువుల యాజమానులు, జంతు ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పురుగు మందు తాగి యువకుడు మృతి

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన కె.చిన్నారావు(23) శుక్రవారం వైజాగ్ కేజీహెచ్‌లో మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై శిరీష్ తెలిపారు. చిన్నారావుకు ఆర్థిక సమస్యలు ఉండటంతో గత నెల 28న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే గజపతినగరం సీహెచ్‌సీకి, అక్కడ నుంచి విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విజయభాస్కరరెడ్డిపై కేసు నమోదు చేయాలి

గజపతినగరం: కొలిమి గుండ్ల ఉపాధ్యాయుడిపై దుర్భాషలాడిన అధికార పార్టీ నాయకుడు విజయభాస్కరరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు డిమాండ్ చేశారు. గజపతినగరం మండలం కేంద్రంలో శుక్రవారం సాయింత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా కొలిమి గుండ్ల మండలం కోర్నపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుపై స్థానిక టీడీపీ నేత విజయభాస్కరరెడ్డి అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఉపాధ్యాయులపై ఇటువంటి హేయమైన చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే వెంటనే విజయభాస్కరరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యాప్రమాణాలు మెరుగుకు కృషి



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి

విజయనగరం టౌన్: దేశ వ్యాప్తంగా విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఎనిమిదో డివిజన్ ఎంజేయూపీ స్కూల్, తొమ్మిదో డివిజన్ శ్రమఫల నగరపాలక పాఠశాలల్లో శుక్రవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత, విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు సీనియర్ ఐఏఎస్‌లతో కమిటీలు ఏర్పాటుచేయబోతుందన్నారు. నిరుపేద కుటుంబాలకు పిల్లల చదువులు భారం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం పుస్తకాలు, పెన్నులు, బట్టలు, బెల్ట్‌లు, షూలు ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ద్వాదశి సుమతి, వేణు, ఎస్ఎస్ఎన్ రాజు, భువనవర్మ, నమ్మి ప్రసాద్, దత్తి సోమునాయుడు, నవీన్, శ్రీను, రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల పరిశీలన



ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలను విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. వైద్య కళాశాల నిర్మాణం, వసతుల కల్పనను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాలలో వసతులు బాగున్నాయని కితాబిచ్చారు. వైద్య విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ప్రొఫెసర్లకు సూచించారు. ఆస్పత్రి ఆవరణలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి వైద్య కళాశాల సిబ్బంది తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు శుక్రవారం స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, షూస్, యూనిఫాంలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులంతా చిన్ననాటి నుంచే ఉన్నత విజయాలు సాధించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఎన్నో ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉత్తమ విజయాలు సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ షకీల్, మండల విద్యాశాఖ అధికారులు ఆనంద్, హెచ్ఎం ఆర్. శంకర్, టీడీపీ నాయకుడు అవనాపు విజయ్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు



హాజరైన సచివాలయ కార్యదర్శులు

విజయనగరం: నగరంలో ఆస్తి, నీటి పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని రెవెన్యూ సిబ్బందికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో పన్నుల లక్ష్యం, వసూళ్ల అంశంపై శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాల వారీగా నీటి పన్ను వసూళ్లు, పైపుల లీకేజీలు, క్లోరినేషన్ పద్ధతులు వంటి అంశాలపై కార్యదర్శులు నిర్వహిస్తున్న విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సచివాలయాల వారీగా రూ.20వేలు నీటి పన్ను వసూలే లక్ష్యంగా అడ్మిన్, ఎమినిటీస్ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా ప్రభుత్వం నిర్దేశించిన నీటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. మందకోడిగా వసూలు చేస్తున్న కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల 30వ తేదీలోగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నీటి పన్ను వసూళ్లను ముమ్మరం చేస్తామన్నారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించిన వెంటనే బాగు చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ఈఈ కె.శ్రీనివాసరావు, ఆర్వో శ్రీనివాసరావు, డీఈఈ అప్పారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కౌలు కార్డులతో అనేక ప్రయోజనాలు

● జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న జిల్లా వ్యవసాయధికారి వీటీ రామారావు, తదితరులు

డెంకాడ: కౌలు రైతుల గుర్తింపు కార్డులు(సీసీఆర్‌సీ)తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, భూమిని కౌలుకు సాగుచేస్తున్న ప్రతీ రైతు గుర్తింపు కార్డులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని పెదతాడివాడ గ్రామంలో కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. అర్హత ఉన్న రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదించి కౌలు గుర్తింపు కార్డులు పొందవచ్చన్నారు. ఈ కార్డులు కలిగి ఉన్న రైతులకు ప్రభుత్వం నుంచి పంట బీమా, నష్టపరిహారం, రాయితీలు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హులవుతారని తెలిపారు. కౌలు రైతులకు ఏమైనా అనుమానాలు ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే వారు సందేహాలను నివృత్తి చేసి కార్డులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.నాగభూషణం, ఏఓ పూడి నిర్మల, ఈఓపీఆర్‌డీ జగన్నాథం, ఎంపీటీసీలు గాదిపల్లి రమేష్, పొంతపల్లి జగన్నాథం, మాజీ సర్పంచ్ పడాల చిన్నారావు, మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, గ్రామపెద్దలు చిరంజీవిరాజు, కోరాడ రమణ, సచివాలయ అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే లోకం నాగమాధవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల రూరల్: విద్యా రంగానికి ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన అందుతోందని, విద్యార్థులకు అవసరమైన వనరులను ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తోందన్నారు. పాఠశాలల్లో సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 28,712 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ చేస్తోందని చెప్పారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గదల బంగారమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మొయిద కళావతి, తహసీల్దార్ ధర్మరాజు, ఎంపీడీఓ రామారావు, ఎంఈఓలు సూర్యనారాయణమూర్తి, విజయ్‌కుమార్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, నాయకులు కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు, బూర్లె శ్రీధర్, గదల అచ్చింనాయుడు, మొయిద సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు గ్రామంలో మురుగుకాలువలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు ఎట్టకేలకు తొలగించారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. గత నెల 30న సాక్షి పత్రికలో 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసకువెళ్లడం జరిగింది. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి కాలువలో ఉన్న స్తంభాన్ని తొలగించి పక్కనే కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

జూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే నాగమాధవికు వినతిపత్రం అందిస్తున్న రామారావు

నెల్లిమర్ల రూరల్: జూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నెల్లిమర్ల జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొండవెలగాడలో ఎమ్మెల్యే లోకం నాగమాధవికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. జ్యూట్ యాజమాన్యం ఎప్పటికప్పుడు మిల్లును మూసివేసి కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తోందన్నారు. కార్మికుల నుంచి వసూలు చేస్తున్న ఈఎస్ఐ, పీఎఫ్‌ను ప్రభుత్వానికి చెల్లించడం లేదన్నారు. 2016 నుంచి విశ్రాంత కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించలేదని వాపోయారు. దీనిపై తక్షణమే స్పందించి కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం



రూ.50 వేల ఆర్థిక సహకారం అందజేస్తున్న దాత సాయికృష్ణ

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణంలోని మెయిన్‌రోడ్డుకు చెందిన సుంకరి సాయికృష్ణ, మమత దంపతులు రూ.50 వేల ఆర్థిక సహకారం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్థిక సహకారం డబ్బులను ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ భారీ అంచనా వ్యయంతో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభించినట్లు చెప్పారు. ఒక్క శ్లాబ్ కోసమే దాదాపు రూ.40 లక్షల వ్యయం అవుతోందన్నారు. దాతల సహకారంతోనే ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఇంకా దాతలు ముందుకొచ్చి అయ్యప్ప ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్‌వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కుమార్ ధనూకా, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలు సంపూర్ణంగా అందేలా చూడాలని ఎంఈఓ విమలమ్మ అన్నారు. భవిత కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆమె సందర్శించారు. కేంద్రంలో ఉన్న పిల్లల అభ్యసన స్థాయిలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఐఈఆర్‌టీ శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.